

# నవోదయం

కప్పగంతుల మల్లికార్జునరావు

శారీరకంగానూ, మానసికంగానూ చక్రవర్తి ఆరోజు బాగా అలసి పోయాడు. ఎప్పుడెప్పుడు ఇల్లు చేరి పక్క మీద వాలిపోయి కళ్ళు

మూర్ధామా అని వుంది.

అయినా తొందరపడకుండా కారును తగుమాత్రం స్పీడులో డ్రైవ్ చేస్తున్నాడు. అతని దృష్టంతా ముందున్న రోడ్డు మీదే వుంది. డ్రైవ్‌చేస్తూ ఆలోచించాడు అతను.

రాత్రి రెండు గంటల సమయం. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. 'నీకు తోడు మేం వున్నాం' అని వీధి దీపాలు ధైర్యం చెప్పతూ కారువెంట పరుగెత్తుతున్నట్లు న్నాయి!

ఉన్నట్లుండి, అల్లంత దూరంలో రెండు ఆకారాలు లీలామాత్రంగా కన్పించాయి. అందులో ఓ ఆకారం చెయ్యెత్తి ఊపుతోంది. కారు ఆప మని కాదుకదా!

కారు స్పీడ్ కాస్తా స్లో చేసి పరి శీలనగా ఆ ఆకారంవంక చూశాడు. ఓ స్త్రీమూర్తి!.. సందేహించలేదు. యువతే! చక్రవర్తి గుండె గుభేలు మంది. స్తబ్దంగా వున్న బుర్ర ఆలోచించడం ఆరంభించింది.

సిటీకి కాస్తంత దూరంగా కొత్తగా వెలసిన 'పోష్ లొకాలిటీ' లో చక్రవర్తి ఇల్లు వుంది. సిటీ బస్సులు పది గంటల తర్వాత వుండవు. ఆ లొకాలిటీలో అంద రికీ కార్లున్నాయి. అంచేత పెద్దగా ఆటోలు కూడా రాత్రి పన్నెండు దాటితే కనిపించవు.

చక్రవర్తి రాత్రి పన్నెండు దాటందే సాధారణంగా ఇంటికి తిరిగిరాడు. అతనికి డ్రైవ్ చేయటం ఇష్టం లేకపోయినా, కారు డ్రైవ ర్‌ను అంత రాత్రివరకు వుంచటం ఇష్టంలేక, రాత్రి పది గంటలకే ఇంటికి పంపించేస్తాడు. కనుక రోజూ ఇంటికెళ్ళేటప్పుడు స్వయంగా డ్రైవ్ చేయకతప్పదు.

అలా అర్ధరాత్రి ఒంటరిగా కారు డ్రైవ్ చేసుకొని పోతున్న ప్పుడు, అతని కారును ఆపటం కొత్త ఏం కాదు. ఎందుకంటే చక్రవర్తి వాళ్ళకాలనీపైన ఇంకా కొందరు పేదల గృహాలున్నాయి. కాలనీదాకా లిఫ్ట్ ఇస్తే అక్కడి నుండి నడచిపోతామని ప్రాధేయ పడుతుంటారు. చక్రవర్తికి అలా లిఫ్టివ్వటం సరదా. కానీ...?

అతనికి తెలీకుండానే కారు వాళ్ళ దగ్గరికెళ్ళి ఆగిపోయింది. చేతులు వూపుతున్న యువతి ఆత్రంగా అతని దగ్గరికొచ్చింది.

"సార్! ఆయన నా భర్త. జబ్బుతో వున్నాడు. వున్నట్లుండి జబ్బు ఎక్కువయింది. హాస్పిటల్‌కి తీసికెళ్ళాలి. ప్లీజ్ కాస్త లిఫ్ట్ ఇవ్వరూ?"

చక్రవర్తి వెళ్ళే దోవలో గాని

ఆప్పై నగాని హాస్పిటల్ లేదు. మరి లిఫ్ట్ అంటుందేం? కారును వెనక్కి తిప్పి సిటీకి తీసుకెళ్ళమనా?

ఆ యువతివేపు పరిశీలనగా చూశాడు చక్రవర్తి. అందమైన యవ్వనపు పొంకం ఏమాత్రం పట్టు సడలలేదు. ఆమె భర్త చూడ పోతే ఆమెకన్నా వయసులో చాలా పెద్దవాడుగా కనిపిస్తున్నాడు. పైగా అనారోగ్యం?

అసలు వాళ్ళిద్దరూ భార్యా భర్త లేనా? అనుమానం?

"ఏమిటి సార్? ఆలోచిస్తున్నారు? అర్ధరాత్రి మీకు ఇబ్బంది కలుగచెయ్యటం నాకూ ఇష్టం లేదు సార్. ఇంటికి వెళ్ళే మిమ్మల్ని వెనక్కి మాకోసం రమ్మనడం నాకు సరదాకాదు కదా సార్? కాని నా భర్త స్థితి చూస్తున్నారుగా? లైఫ్ అండ్ డెత్ క్వొశ్చన్. ప్లీజ్ హెల్ప్."

చక్రవర్తి ఆపదలోవున్న వారిని ఆదుకోవటం తన ధర్మంగా భావిస్తాడు. అలా ఎందరికో అడగకుండానే సహాయాలు చేసాడు కూడా!

కానీ?....

అతను ఓ క్షణం ఆలోచించి జేబులోనుండి డబ్బుతీసి ఆమెకు ఇవ్వబోతూ అన్నాడు.

"క్షమించండి మేడం. మీ ఆందోళనను, ఆదుర్దాను నేను అర్ధం చేసుకోగలను. కానీ ఇప్పుడు నేను కారు డ్రైవ్ చేయగల స్థితిలో లేను. ఈ డబ్బు తీసుకొని టాక్సీలో వెళ్ళండి" అది నిజం కాదు. మంచి పని చేయటానికి శారీరక అలసట ఎన్నడూ అడ్డు రాదు అతనికి.

ఆమె అతని డబ్బు తీసుకోకుండా మెల్లగా నవ్వింది.

"సార్! డబ్బుతో అయ్యే పని అవుతే ఇంతసేపు రోడ్డుమీద పడిగాపులు కాచి వుండేదాన్ని కాదు సార్. నా భర్త ప్రాణంకన్నా నాకేదీ ముఖ్యం కాదు. ఐతే ఇవాళ కార్లు, టాక్సీలు, ఆటోలు అన్నీ బంద్. మీకు తెలియదా?"

తెలుసు. కానీ అతనికి ఆ విషయం గుర్తుకు రాలేదు. గుర్తుకు తెచ్చాక ఏవో అనుమానాలు!

"సార్! మీరు మంచివారులా ఉన్నారు. కానీ నామీద మీకింకా నమ్మకం కుదరలేదు. బిచ్చగత్తెనో మోసగత్తెనో అని అనుమానిస్తున్నారు. కానీ కాదు సార్. నిజంగా ఆపదలో వున్నాను. నా భర్త ప్రాణాలు ఇప్పుడు మీ చేతులో ఉన్నాయి. దయచేసి లిఫ్ట్ ఇవ్వండి. మీ శ్రమను, కాలాన్ని వుచితంగా

ఇవ్వవద్దు. తగు ప్రతిఫలాన్ని తీసుకొనే ఇవ్వండి."

ఉలిక్కిపడ్డాడు చక్రవర్తి. ప్రతిఫలం! ఈ యువతి అర్థరాత్రిపూట తనకు ఇస్తానంటున్న ప్రతిఫలం ఏమిటి?

కొంపతీసి....?

అతనికి ఆమె కథ నమ్మబుద్ధి వేయలేదు. ఆమె మాటల వెనుక ఏదో ఒక మోసం, కుట్ర ఉన్నట్లు అనుమానం బలపడింది. ఆమె ఓ గ్యాంగ్‌కు లీడర్ కాదు గదా? ఈ భర్త, జబ్బు, హాస్పిటల్—అంతా కట్టు కథ. దయతలిస్తే ప్రమాదం. పైగా పరువుపోతుంది. మంచితనం వంచించబడటం ఎంత బాధాకరం? లేనిపోని తద్దినం? అతను కారు ఇంజన్‌ను స్టార్ట్ చేయబోయాడు.

"సార్!"

ఆమె చేయి అతని చేతిని పట్టుకొంది. అతనికి దడ పట్టుకొంది. ఆమధ్య జరిగిన ఓ సంఘటన గుర్తుకొచ్చింది.

"మిమ్మల్ని వెళ్ళనివ్వను సార్! కావాలంటే ఇదిగో ఈ డబ్బు తీసుకొని నాకు లిఫ్ట్ ఇవ్వండి."

ఆమె మాటలు అతనికి వినిపించలేదు. విష సర్పమేదో చేతికి చుట్టుకొన్నట్లు వణకసాగాడు.

ఆరోజు ఆ దృశ్యం....?

* * *

స్వభావ సిద్ధంగానే చక్రవర్తి మంచివాడు. మానవతా దృష్టిగలవాడు. చాలామందికిలా బలహీనతలు లేని సమర్థుడు.

"ఒరేయ్ చక్రీ! ఆత్మవిశ్వాసం లేని మనిషి చవిటి నేలలో నాటబడ్డ మొక్కలాంటి వాడు. ఎక్కరాడు. ఎన్ని నీళ్ళు పోసినా మొక్కకు చీడ ఎలాంటిదో మనిషి మనసుకు అనుమానం, అవిశ్వాసం అలాంటివి. కృంగదీస్తాయి. ఎక్కరావాలనుకొన్న మనిషికి, ఆత్మ విశ్వాసంతోపాటు ఇతరుల పై నమ్మకం కూడా సహజసిద్ధమయిన ఏరువులా తోడ్పడుతుంది. మనిషి మనిషిని నమ్మని కాలం దుష్టకాలం గుర్తుంచుకో!"

అవి చిన్నప్పుడు ఎప్పుడూ నాయనమ్మ చెప్పిన మాటలు. చక్రవర్తి జీవితంలో అభివృద్ధి గాంచటానికి ఎంతో వుపయోగపడ్డాయి. అతను జీవితంలో ధైర్యం చేసి గొప్ప రిస్కులు తీసుకొన్నాడు. కష్టాలు అనుభవించినా, స్వయంకృషితో, ప్రతిభతో పైకి వచ్చాడు. బోలెడంత డబ్బు సంపాదించాడు. 'బిజీ' మనిషి అయ్యాడు.

అయినా తన గతాన్ని మర్చి పోలేదు. డాంబికాలకు పోలేదు. ధనాన్ని విలాసవస్తువుగా కాక పవిత్రమైన భగవత్ స్వరూపంగానే చూచేడు. డబ్బుతో పాటు వచ్చే వ్యసనాల వుచ్చులో యిరుక్కోలేదు.

అతనికి వున్న వ్యసనం ఒక్కటే-నిజంగా ఆపదలో వున్న వారికి సహాయం చేయడం. అలా ఎందరికి ఎన్నివిధాల సహాయాలు చేసేడో? ఎన్ని కుటుంబాలు నిలిపేడో? ఎంత తృప్తి!

నేరులో వెళ్తున్నా అతని కళ్ళు ఆపదలో వున్న వ్యక్తులకోసం వెతుకుతూ వుంటాయి. అడగకుండానే కారులో లిఫ్ట్ యివ్వటం అతనికి సర్దా. అయితే అతనెప్పుడూ వయసువచ్చిన ఆడవాళ్ళను తన కారులో ఎక్కించుకోడు.

వయస్సువచ్చిన ఆడవాళ్ళంటే అతనికిసిగ్గు.అదో విధమైన భయం. బిజినెస్ వ్యవహారాల్లో కూడా అతను తన క్రింద పనిచేసే వుద్యోగినుల వైపు కన్నెత్తి చూడడు. లేడీ స్టెనోకి, నేలను చూస్తూనే డిక్టేట్ చేస్తాడు. స్త్రీలతో తన రూమ్‌లో మాట్లాడాల్సి వచ్చినప్పుడు తలుపులు బార్లాగా తెరిచి వుంచుతాడు.

"ఆత్మ విశ్వాసంతో పాటు ఎదుటి వ్యక్తులపై నమ్మకం వుంచాలని మీ నాయనమ్మ చెప్పిందని అంటుంటారు కదా? మరి ఆడవాళ్ళంటే యిలా భయపడటాని క్కారణం - స్త్రీలమీద నమ్మకం లేకా? మీ మీద మీకే నమ్మకం లేకా?"

భార్య హేళనకు ఏం జవాబు చెప్పగలడు అతను?

"అన్ని నమ్మకాలు, విశ్వాసాలు నీమీదనే కేంద్రీకృతం చేయటంవల్ల" అంటూ చిలిపిగా ఆమెను దగ్గరకు తీసుకొని నోరు మూయిస్తాడు-మూస్తాడు సున్నితంగా.

అలాగని ఆడవాళ్ళకు సహాయం చెయ్యడనికాదు. ఏ సహాయమన్నా చేస్తాడు. కారులో ఎక్కించుకోమంటే మాత్రం ఎక్కించుకోడు.

ఆరోజు మామూలుగా పొద్దుపోయి తిరుగు ప్రయాణమై గృహోన్ముఖుడయ్యాడు. కారు ఇంకా సిటీ సెంటర్‌లోనే వుంది. పోలీస్ కానిస్టేబుల్ కారు ఆపేడు.

* * *

"సార్! కాస్త లిఫ్ట్ ఇవ్వరూ?"

"ఎక్కండి! ఎక్కడికెళ్ళాలి?" అంటూ కారుడోర్ లాక్ తీశాడు.

"నాక్కాదు సార్! ఆ అమ్మా

యాకి" డోర్ తెరుస్తూ అన్నాడు పోలీసు.

దీపపు నీడలోనుంచి కారు వద్దకు వస్తున్న ఆ యువతిని చక్రవర్తి అప్పుడు గమనించాడు. ఆ అమ్మాయి అతడిని చూచి కిసుక్కుమని నవ్వింది. శరీరపు ఒంపుల్ని, అందాల్ని ప్రదర్శిస్తున్నట్లు హొయలు ప్రదర్శించింది.

చక్రవర్తి సిగ్గుతో తలదించుకొన్నాడు. గుండెలు భయంతో కొట్టుకొన్నాయి. ఆమెపట్ల అసహ్యం వేసింది.

"ఈ అమ్మాయి ఒంటరిగా వస్తుందా?"

"ఏం—మీకు అభ్యంతరం లేదుగా?"

"పోనీ! మీరు రాకూడదూ!"

పోలీసు చిత్రంగా నవ్వేడు.

"భలేవారండీ మీరు! పని వున్నది ఆ అమ్మాయికైతే నేనెందుకండీ వెంట? ఐనా మీరున్నారుగా తోడు? ఇంకేం భయం? ఎక్కు విమలా!"

"సారీ! ఒంటరి ఆడవాళ్ళకు నేను లిఫ్టు ఇవ్వనండీ!"

ఆమె అప్పటికే ఎక్కి కూర్చుంది.

"ఏమండీ! చూడబోతే మీరొట్టి అనుమానస్తుల్లాగున్నారు. ఆడ దాన్ని నేను పడాల్సిన భయాలను మీరు పడుతున్నారు. మగాళ్ళు మీకేమండీ? ఎటొచ్చినా ఆడవాళ్ళం మాకేగా అన్ని చిక్కులూ, బాధలూ? మా అన్నయ్య పోలీసు కానిస్టేబుల్ కనుక నేనింత ధైర్యంగా రాగలుగుతున్నా. లేకపోతే వచ్చేదాన్నా? నాకు అర్జంట్‌గా వెళ్ళాల్సిన పని వుంది. దయచేసి కారు ఎక్కిన దాన్ని దించేయకండి. కారు స్టార్టు చేయండి ప్లీజ్!"

ఇంకా కొంత వాదనలయ్యాక కానిస్టేబుల్ కూడా కలుగజేసుకొని ఆమె తన చెల్లెలని చెప్పి ప్రాధేయపడటంతో అయిష్టంగానే కారు స్టార్టు చేసేడు చక్రవర్తి. కానిస్టేబుల్ నెంబరు మనసులో నోట్ చేసుకొన్నాడు.

కారులో లైటు వేసే వుంచి నెమ్మదిగా డ్రైవ్ చేస్తున్నాడు కారు.

"లోపల లైట్ ఎందుకండీ? డ్రైవ్ చేయటం కష్టం కాదూ? పైగా నాకు సిగ్గబ్బా! లైటు ఆర్పేస్తా" అంటూ మధ్యగా వున్న స్విచ్‌ని ఆఫ్ చేసింది విమల.

'సిగ్గా? దేనికిట?' చక్రవర్తి అనుమానం, భయం ఎక్కువయ్యాయి. 'లైటు వేసివుంటే ఆమె

మొహం ముందున్న అద్దంలో నుంచి కన్పిస్తుంది. ఆమె భావనలు, చేష్టలు తెలుస్తాయి. లైటు ఆర్పేస్తే చీకట్లో ఏం చేస్తుందో?'

అతను చెయ్యి వెనక్కి చాచి స్విచ్ ఆన్ చేసేడు. లైట్లు వెలిగేయి. కాని స్విచ్ మీద అతని చేయి మీద ఆమె చేయి పడింది.

"ఆడదంటే అంత భయమైతే ఎలాగండీ? ఏం—నేను అందంగా లేనా? మీ భయమూ సిగ్గూ క్షణంలో పోగొడ్తాగా? లైట్ ఆర్పేయండి!"

లైటు ఆరిపోయింది. ఆమె అతని మెడను కౌగలించుకొంది. మెల్లగా బేక్ సీట్ లో నుంచి ఫ్రంట్ సీట్ లో అతని పక్కకు జారింది. అతడిని గట్టిగా కౌగలించుకొంది. బుగ్గ ముద్దు పెట్టుకొంది.

అతను ఆమెను వదిలించుకొందామని ప్రయత్నం చేసేడు. సాధ్యం కాలేదు. లైటు వేసేడు. కారు ఆపేడు. కారుతోపాటు రెండు మోటార్ సైకిళ్ళు వెనుకనుంచి వచ్చి ఆగేయి. వాటినుంచి నలుగురు పోలీసు అధికార్లు దిగేరు.

"కారు ఆపావేంటి డార్లింగ్? లైటు వేసేవెందుకు? నన్ను నడి బజార్లో వదిలేస్తావా? మీ యింటికో లాడ్జికో తీసుకెళ్ళి యీ నైటంతా స్పెండ్ చేస్తానని ప్రామిస్ చేసేవుగా? ప్లీజ్, డార్లింగ్! నన్ను యిలా వదిలెయ్యకు." ఆమె అతడి గుండెల్లో తలపెట్టి గోముగా అంది.

"ఏయ్ మిస్టర్! ఎంత ధనవంతుడివయితే మాత్రం మరీ యింత పబ్లిక్ గా ప్రణయం సాగిస్తావా? ఆ గర్ల్ ఎవరు? నీకేమవుతుంది?"

చక్రవర్తి దిక్కు చచ్చిపోయాడు. జరిగిన కథ చెప్పేడు. కానీ నమ్మేదెవరు? ఆ కానిస్టేబుల్ నెంబరు చెప్పేడు. పేరడిగేరు. తెలిస్తేనా?

"మిస్టర్! యిలాంటి కేసులు మాకు మామూలే. మాయ మాటలు చెప్పి ఫామిలీ లేడీస్‌ను యిలా తీసుకురావటం, పట్టుకొంటే ఆడాళ్ళమీదకి తప్పంతా తోసెయ్యటం మామూలే. కోర్టులో నీ కథలు చెపుదువుగానీ, ముందు పోలీస్‌స్టేషన్‌కు పద!"

ఆ పోలిస్‌కానిస్టేబిల్, ఆ అమ్మాయి, యీ పోలీసులు అంతా కల్సి తన మెడకు వుచ్చు వేసినట్లు గ్రహించాడు చక్రవర్తి. ఆ వుచ్చు నుంచి బయట పడటానికి రెండే రెండు మార్గాలున్నాయి. తన ఇన్‌ఫ్లుయన్స్‌ను వుపయోగించి పై

లెవల్లో వాళ్ళను పట్టుకొని యీ మోసగాళ్ళ అంతు చూడటం. రెండోది డబ్బిచ్చేసి యీ వృచ్చులో నుంచి నెమ్మదిగా బయటపడటం.

అతను మానవత్వాన్ని, మంచి తనాన్నీ చంపుకొని కేవలం బిజినెస్‌మేన్‌గా పరావర్తనం చెందేడు. పోలీసు అధికారులకు కావల్సింది యిచ్చేసేడు.

"సార్! మరి నా ఫీజు?"

"ఫీజా? నీకు దేనికి ఫీజు? అల్లరి పెట్టినందుకా?"

"అది నా వృత్తి ధర్మం సార్! మీకు యిష్టమున్నా లేకపోయినా మీ మీద అంతసేపు ప్రేమ నటించాను కదా! మీ మెడను కౌగలించుకొన్నాను కదా! కష్టం నాది— ఫలితం ఆ పోలీసులకూనా? యిక నెప్పుడూ మీ జోలికి రాకుండా ఫీజు యిచ్చి పంపండి సార్!" ఆమె చెయ్యి వదిలించుకోటానికి మరో చెయ్యి జేబులో పెట్టేడు చక్రవర్తి!

* * *

ఆమె అతని చేతిలో బలవంతంగా నోట్లు కుక్కింది. ఆమెచేతి నుంచి విడిపోయిన తన చేతిని చూచుకొన్నాడు చక్రవర్తి.

డబ్బు! ఆమెకు అవసరమైన డబ్బు. ప్రాణప్రదంగా దాచుకొన్న డబ్బు! అవసరాచికిమించి తన వద్ద నున్న డబ్బు!

ఆ డబ్బు ప్రాణాలని నిలుపుతుంది. ప్రాణాలని తీస్తుంది. మనుష్యుల్ని కలుపుతుంది. విడదీస్తుంది. అమృతాన్ని పంచుతుంది. విషాన్ని చిప్పిలుతుంది.

మనిషిని మనిషి నమ్మనికాలం వచ్చింది. మంచికీ చెడుకూ సత్యాసత్యాలకూ బేధం తెల్సుకోటానికి వీల్లేని దుస్థితి మనిషికిదాపురించింది. ఎందువల్ల? డబ్బువల్లా? లేక మనిషిలో ఆశావ్యామోహాలు, భోగలాలస పెరగటం వల్లా?

"సార్! ఆ డబ్బు చాలకపోతే ఇదిగో....ఇది కూడా తీసుకోండి."

అతను ఉలిక్కిపడ్డాడు. ఆమె పట్ల అప్పుడప్పుడే ఏర్పడుతున్న నమ్మకానికి అడ్డంకి ఏర్పడింది. 'డబ్బు చాలకపోతే ఏమిస్తుంది? శీలాన్ని కాదు కదా?'

తలతిప్పి ఆమెవైపు మెల్లగా చూశాడు. ఆమె మంగళసూత్రాన్ని పట్టుకొని వుంది.

ఒక్క క్షణంలో ఉత్తమురాలైన ఆ సాధ్విని అపార్థం చేసుకున్నందుకు అతని తల సిగ్గుతో వాలిపోయింది. అనుమానం మనిషికి ఎంత శత్రువు?

"అమ్మా!" ఆ రెండు అక్షరా లను మనసు పదే పదే పశ్చాత్తా పంతో అనుకొని ఏడ్చింది.

"మనిషి ప్రాణం విలువైనది సార్! అందునా ఆ ప్రాణం భర్త దయినప్పుడు ఆ విలువను దేనితో వెలకట్టగలం? వైద్య సహాయం లేక తన భర్త నడిరోడ్డుమీద చని పోయే స్థితిని ఏ స్త్రీ సహించ గలదు? మీరు నా కథను నమ్మటం లేదు. అందుకు నేను మిమ్మల్ని నిందించను. కాలప్రభావం అది. కానీ మీరుతప్ప మాకు దిక్కులేన ప్పుడు, ఆ కాస్త ఆధారాన్ని ఎలా వదులుకోను? నా భర్త చనిపోతాడు. ఆ తర్వాత నేను మీ కారు క్రిందే పడి ప్రాణత్యాగం చేసుకొంటాను. ఆతర్వాత మీరు వెళ్ళిపొండి. అందాకా మిమ్మల్ని వెళ్ళనివ్వను." ఆమె వెళ్ళి కారుముందు కూర్చొని వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

చక్రవర్తి ఇంతవరకు కారు లోనే కూర్చుని వున్నాడు. డోర్ లాక్ లు తెరవలేదు. ఇప్పుడు కారు దిగాడు. అతని కళ్ళవెంట నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి. ఆమెకు చేతులెత్తి నమస్కరిం చాడు.

"అమ్మా! దుష్ట అనుభవాలు నన్నింతవరకు పిరికివాడుగా చేసే యమ్మా! మంచి చేయటానికి భయ పడాల్సిన కాలం వచ్చింది. నిన్ను విశ్వసించలేని నా అపరాధాన్ని మన్నించమ్మా! నాకు డబ్బుకు కొరతలేదు. నా డబ్బును సద్వి నియోగం చేయటానికి అవసరమైన స్నేహ వాతావరణం కావాలి. అలాంటి సత్ వాతావరణం లేని ఈ దేశం ఎంత దురదృష్టవంతమైనది? హాస్పిటల్ కు వెళదాం లేమ్మా!"

అతను ఆమెకు డబ్బు తిరిగి ఇచ్చేసేడు. ఆమె భర్త వద్ద కెళ్ళాడు. అతని మీద చెయ్యివేసి షాక్ తిన్నట్లు వెనక్కి తీసు కొన్నాడు. ఆయన దేహం చల్లగా వుంది! 'ప్రాణం పోలేదు కదా? భగ వంతుడా! ఆ స్త్రీ పసుపు కుంకు మలు నిలుపు'

అతడిని జాగ్రత్తగా పరిశీలిం చాడు. ప్రథమ చికిత్స చేశాడు. ఇంకా ప్రాణం పోలేదు. కొన ప్రాణం ఎక్కడో కొట్టుకులాడు తున్నది. సరైన చికిత్స చేయిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యే అవ కాశం వుంది.

ఆ రోగిని నెమ్మదిగా భుజం మీదికెత్తుకొని కారులో కూర్చో పెట్టాడు చక్రవర్తి కారును వేగంగా హాస్పిటల్ వేపు డ్రైవ్ చేయసాగాడు.

మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని, తోటి మనిషిలో నమ్మకాన్ని కలి గించే ఆ హాస్పిటల్ ఎక్క డుందో? *